క్లుప్తంగా

ఎంపీడీఓగా వెంకటనారాయణ బాధ్యతల స్వీకరణ



కోటనందూరు: స్థానిక ఎంపీడీఓగా పి.వెంకటనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా యు.కొత్తపల్లి మండలం నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్య శర్మ శంఖవరం మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఎంపీడీఓకు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

తుని ఎంపీడీఓగా సాయినవీన్



తుని రూరల్: తుని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా సాయినవీన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు తునిలో ఎంపీడీఓగా పని చేసిన పి.రవికుమార్ ఉప్పాడ కొత్తపల్లి మండలానికి బదిలీ అయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఎంపీడీఓగా పని చేసిన సాయినవీన్ బదిలీపై ఇక్కడికు వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

భారీ వర్షం

ప్రత్తిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ప్రత్తిపాడులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక అల్లూరి జంక్షన్, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, అగ్నిమాపక కేంద్రం వద్ద నీరు నిల్వ ఉండిపోయింది. ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ వెనుక వీధిలో వాన నీరు పోయే మార్గం లేక సిమ్మెంటు రోడ్డు చెరువులా రూపాంతరం చెందింది. అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మండల పరిషత్ ఏఓగా శ్రీనివాస్



గోకవరం: స్థానిక మండల పరిషత్ ఏఓగా డి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఓగా పని చేసిన ఎం.ప్రసాద్ రాజమహేంద్రవరం పంచాయతీరాజ్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న శ్రీనివాస్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయన గోకవరం పంచాయతీ కార్యదర్శిగా పని చేశారు.

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఐదుగురు కార్యదర్శులుగా సోమవారం బాధ్యతలు చేపట్టారని ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. ఏలూరు జిల్లా కలిదిండి నుంచి బదిలీపై వచ్చిన ఎం.లక్ష్మీనారాయణ మండలంలోని రాచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా, పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి నుంచి బదిలీపై వచ్చిన జ్యోతుల పద్మరాజు ప్రత్తిపాడు గ్రామ కార్యదర్శిగా, ఏలూరు గ్రామ కార్యదర్శి బి.కామరాజు ధర్మవరం సెక్రటరీగా, గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామ కార్యదర్శి బి.నాగమణి పోతులూరు గ్రామ కార్యదర్శిగా, గండేపల్లి పంచాయతీ కార్యదర్శి పి.నాగమణి మండలంలోని పెద్దిపాలెం గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారని ఎంపీడీఓ కుమార్‌బాబు వివరించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలో కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పులి జార్జిబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెడ్ ఆఫీసు జాబ్ సెక్యూరిటీ గైడ్ లైన్స్ పాటించకుండా కండక్టర్ ఎస్ఎస్‌రావు(నల్ల శ్రీను)ను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. శ్రీనును విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ నాయకులు యూబీఎం కుమార్, కె.మాణిక్యం, కె.త్రిమూర్తులు, ఎన్‌పీరావు, నానిబాబు, చలం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తుని: తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీల నిర్వహణకు తీసుకొచ్చిన యాప్‌లన్నింటినీ ఒకే యాప్ చేయాలని, గర్భిణులు, బాలింతలకు తీయాల్సిన ఎఫ్ఆర్ఎస్‌ను ఉపసంహరించుకోవాలని, నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని, అంగన్‌వాడీ సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు.

రహదారిద్ర్యం !



చెరువును తలపిస్తున్న పెద్దిపాలెం ప్రధాన రహదారి



ఉత్తరకంచిలో బురదమయంగా మారిన ప్రధాన రహదారి

- గ్రామాల్లో ఛిద్రమైన ప్రధాన రహదారులు
- అడుగడుగునా గోతులతో ప్రమాదాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం, శాంతిఆశ్రమం, ఇ.గోకవరం, బురదకోట, టి.రాయవరం, పి.జగన్నాథపురం, ఏలూరు రహదారులు అధ్వానంగా మారాయి. ఈ రహదారులపై అడుగడుగునా గోతులు ఏర్పడటంతో వాహన చోదకులు నరకం చూస్తున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. రహదారులపై ఏర్పడిన గోతుల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

పెద్దిపాలెం రహదారికి కలగని మోక్షం

మండలంలో పెద్దిపాలెం ప్రధాన రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. ఈ రహదారి పొడవునా భారీ గోతులతో చిందరవందరగా ఉండటంతో పెద్దిపాలెం పరిసర గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. వర్షం వస్తే రహదారిపై ఏర్పడిన భారీ గోతుల్లోకి వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. నిత్యం ఈ రహదారిని పది గ్రామాలకు చెందిన ప్రజలు వినియోగిస్తారు. గిరిజన గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగానే మైదాన ప్రాంతాలకు వస్తారు. రహదారి అధ్వానంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. రహదారి అధ్వానంగా ఉండటంతో తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

ఆర్టీసీకి ప్రధాన ఆదాయ మార్గం

ఆర్టీసీకి గ్రామీణ రూట్లలో పెద్దిపాలెం -కాకినాడ రూట్ అత్యంత ప్రధానమైనది. ఈ రూట్‌లో 40 నిమిషాలకు ఒక్క ఆర్టీసీ బస్సు తిరుగుతుంది. అన్ని బస్సులు రద్దీగానే దర్శనమిస్తాయి. తద్వారా ఆర్టీసీకీ భారీగానే ఆదాయం వస్తుంది. ప్రస్తుతం రహదారి అధ్వానంగా ఉండటంతో నిత్యం ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సులను తిప్పేందుకు అధికారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇక బస్సులు గమ్యస్థానానికి చేరుతుందో లేదో తెలియని పరిస్థితి ప్రయాణికులది. ఏళ్ల గడుస్తున్నా ఈ రహదారికి మోక్షం మాత్రం కలగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మైనింగ్ రవాణాతో రహదారుల ధ్వంసం

లేటరైట్ మైనింగ్ రవాణాతో పదేళ్ల క్రితం మండలంలోని రహదారుల పూర్తిగా ధ్వంసయ్యాయి. భారీ వాహనాల రాకపోకల కారణంగా అప్పట్లో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దశాబ్దం కిందటే ఈ రహదారుల ధ్వంసమైనా నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. అప్పట్లో మండలానికి భారీగా మైనింగ్ నిధులు మంజూరైనా పెద్దిపాలెం రహదారికి నిధులు మంజూరు చేయలేదు.

నరకయాతన పడుతున్నాం



ఉత్తరకంచి - పెద్దిపాలెం రహదారి భారీ గోతులతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ రహదారిపై ప్రయాణించేందుకు నరకయాతన పడుతున్నాం. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఏళ్లు గడుస్తున్న రహదారికి మోక్షం కలగడం లేదు. అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించాలి.

-సాలరపు పవన్ కుమార్, స్థానికుడు, పెద్దిపాలెం

వాహనాలు దెబ్బతింటున్నాయి



ఉత్తరకంచి నుంచి పెద్దిపాలెం వరకూ రహదారి భారీ గోతులతో అధ్వానంగా తయారైంది. ఈ రహదారిపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. భారీ గోతుల కారణంగా వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఆదాయం కన్నా నష్టమే ఎక్కువ వస్తుంది.

-గొల్లవిల్లి దొరబాబు, ఆటో డ్రైవర్, పెద్దిపాలెం

టెట్‌కు 67 మంది గైర్హాజరు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం టెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 191 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 184 మంది హాజరు కాగా 67 మంది గైర్హాజరైనట్టు వివరించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యశస్వి సూచించారు. మండలంలోని వంతాడ గిరిజన గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 37 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్వి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. హెల్త్ సిబ్బందితో కలిసి గడప గడపకూ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

కిర్లంపూడి: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ తోట రవి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు హాలులో సోమవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, చేపట్టే పనుల గురించి చర్చించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం ఉండడం లేదని పలువురు ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీటీసీల మండల సమాఖ్య ప్రెసిడెంట్ అల్లు శివరామకృష్ణ ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు.

కన్నులపండువగా బోనాల సంబరం



జగపతినగరంలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కిర్లంపూడి: శరన్నవరాత్రుల్లో భాగంగా జగపతినగరంలోని నరసయ్యపేట, కిర్లంపూడిలోని వనదుర్గమ్మ ఆలయాల వద్ద సోమవారం బోనాల సంబరాలు వైభవంగా జరిగాయి. భవానీ భక్తులు, మహిళలు బోనాలు శిరస్సున దాల్చి గ్రామంలో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లింగంపర్తిలో ఏకాహం

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో సోమవారం ఏకాహం నిర్వహించారు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా గ్రామ సత్రంపంపు కాలనీలోని దుర్గాదేవి ఆలయం వద్ద గుర్రం వీరబాబు ఆధ్వర్యంలో ఏకాహం ఏర్పాటు చేశారు. పలు భజన బృందాల సభ్యులు పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆలమూరి సుబ్బలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

లలితా హోమం

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో సోమవారం లలితా హోమం నిర్వహించారు. లలితా పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాండవ నదీ తీరంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారికి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, వేద విద్యార్థులు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో పడి పూజ

గండేపల్లి: మండలంలోని గండేపల్లి కృష్ణాలయం వద్ద ఆదివారం రాత్రి భవానీ భక్తులు పడిపూజ నిర్వహించారు. వేదికను పలు రకాల పవ్వులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.

పాలనపై అవగాహన అవసరం

- ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్
- ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ



ప్రత్తిపాడు శిక్షణలో ప్రసంగిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: గ్రామాల ఉప సర్పంచులు, పాలకవర్గ సభ్యులకు పంచాయతీ పాలనపై అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం దృష్ట్యా గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టం, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఏలేశ్వరం: ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉప సర్పంచులు, పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పడేలా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ

రౌతులపూడి: మండలంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో పంచాయతీ పరిపాలనా విధానం, పంచాయతీరాజ్ చట్టం, పారిశుధ్య వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి పలు అంశాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలు గ్రామాల వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగ్గంపేట: గండేపల్లి మండలంలోని పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాతి బుజ్జి ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



జగ్గంపేటలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద సోమవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ 356 మంది దివ్యాంగులకు ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలిమ్కో సంస్థ సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో గుర్తించిన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, కృత్రిమ కాళ్లు తదితర వాటిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు లక్ష్మణరావు, మండల అధ్యక్షుడు అత్తులూరి నాగబాబు, జెడ్పీటీసీ ఒమ్మి బింధుమాధవి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సీఆర్ఓ శ్రీరామ్, జిల్లా అధ్యక్షులు మండపాక అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



తునిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

తుని: గ్రామ/వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి నెక్కెళ్ల శ్రీనివాస్ డిమాండు చేశారు. స్థానిక రాజా గ్రౌండ్‌లో గొర్ల వెంకటరమణ అధ్యక్షతన సోమవారం గ్రామ, వార్డు వలంటీర్ల సంఘ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వలంటీర్లకు బకాయి పడిన నాలుగు నెలల వేతనాన్ని తక్షణమే చెల్లించాలన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు రూ.10 వేల చొప్పున వేతనం చెల్లించాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని డిమాండు చేశారు. అనంతరం రాజా గ్రౌండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు మనేంద్ర, సురేంద్ర, రాజు, శ్రీను, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు దుస్తుల పంపిణీ

గండేపల్లి: మండలంలోని యర్రంపాలెంలో వ్యవసాయ కూలీలకు సోమవారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలో పొలం పనులు చేస్తున్న కూలీలకు దుస్తులు అందజేసినట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మహాచండీదేవీ నమోస్తుతే..

- విశేష అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం/కోటనందూరు/శంఖవరం/ప్రత్తిపాడు రూరల్/గండేపల్లి/కిర్లంపూడి/గోకవరం/జగ్గంపేట/తొండంగి: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం కనకదుర్గమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోకవరంలోని దేవీచౌక్ కనకదుర్గమ్మకు ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరభద్రునిగడ్డలోని కనకదుర్గమ్మ శ్రీమహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. కోటనందూరు మండలం కాకరాపల్లిలో కనకదుర్గమ్మ మహాచండీదేవిగా సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో అమ్మవారిని చండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. యూనివర్సిటీ చైర్మన్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఏలేశ్వరంలో..


ఏలేశ్వరంలో దుర్గాదేవి అమ్మవారిని సోమవారం జగన్మాతగా అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని తోట వీధి, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం, సువ్వయ్యమ్మపేట, నర్సీపట్నం రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి మండపాల వద్ద కుంకమ పూజలు నిర్వహించారు. భక్తులు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కిర్లంపూడి మండలంలో..

కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, జగపతినగరంలో అభయదుర్గమ్మ, రామచంద్రపురంలో కనకదుర్గమ్మ అమ్మవార్లు సోమవారం మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవార్లకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



రత్నగిరిపై కళ్యాణ గౌరీదేవి అలంకరణలో వనదుర్గ అమ్మవారు



మహాచండీదేవి అలంకారంలో గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ



కాకరాపల్లిలో చండీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో..

ప్రత్తిపాడు మండలం రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలోని అపిత కూచాంబ అమ్మవారు సోమవారం మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లోని విజయ దుర్గా అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దిపాలెం, ఉత్తరకంచి, శరభవరం, గజ్జనపూడి, పోతులూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో అర్చకులు, అమ్మవారికి అలంకార పూజలు, కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణలు నిర్వహించారు. శంఖవరం మండలం సీతంపేటలో దుర్గామీనాక్షి అమ్మవారికి పట్టు వస్త్రాలతో మహాచండీదేవి అలంకరణ చేశారు.

కల్యాణగౌరీ అలంకరణలో..

దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నవరంలో రత్నగిరిపై వేంచేసిన వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు కల్యాణ గౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఒమ్మంగిలో మహాచండీదేవి అలంకరణలో జగన్మాత



ఏలేశ్వరంలో జగన్మాతగా దర్శనమిచ్చిన అమ్మవారు

అన్నపూర్ణాదేవి అలంకరణలో నేరేళ్లమ్మ అమ్మవారు

తొండంగి మండలం గోపాలపట్నంలోని నేరేళ్లమ్మ అమ్మవారు సోమవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన 5 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.